ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
విజయనగరం
జిల్లా వార్తలు
ఆదివారం 14 సెప్టెంబరు 2025



అందరి సహకారంతో ముందుకు..



కలెక్టర్ రామసుందర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో కీర్తి



బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

- వెనుకబడిన రంగాలపై ప్రత్యేక దృష్టి
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తామని, ఎలాంటి సమస్యలు వచ్చినా అందరి సహకారంతో పరిష్కరిస్తామని, వెనుకబాటును చక్కదిద్దుతామని కలెక్టర్ రామసుందర్ రెడ్డి అన్నారు. జిల్లా కలెక్టర్‌గా శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా ఏయే రంగాల్లో వెనుకబడి ఉందో ముందు పరిశీలించి అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిపెడతామన్నారు. వలసలను నివారించి ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రధానంగా ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యక్రమాలను ముందుకు నడిపిస్తామన్నారు. జిల్లా అభివృద్ధి విషయంలో సీఎం పలు సూచనలు ఇచ్చారని, వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రాజెక్టులు, పరిశ్రమల భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. గిరిజన విశ్వవిద్యాలయ భవనాల ఏర్పాటు ప్రక్రియను పురోగతి వైపు (మిగతా 8వ పేజీలో..)

ఎస్పీగా దామోదర్

- వకుల్ జిందాల్ గుంటూరు ఎస్పీగా బదిలీ



కొత్త ఎస్పీ దామోదర్

విజయనగరం క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్త ఎస్పీగా ఏఆర్ దామోదర్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఇప్పటివరకు ప్రకాశం జిల్లా ఎస్పీగా ఉన్నారు. 2019లో మూడు నెలల పాటు విజయనగరం ఎస్పీగా పనిచేశారు. వైజాగ్ క్రైం డీసీపీగా, పాడేరు ఓఎస్డీగా, ఒంగోలు పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్‌గా కూడా బాధ్యతలు చూశారు. కాగా ఇప్పటివరకు జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న వకుల్ జిందాల్‌కు గుంటూరు ఎస్పీగా బదిలీ అయింది. ఈయన విధి నిర్వహణలో తనైదన శైలిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేశారు. జిల్లాలో చాలావరకు గంజాయి రవాణాను నియంత్రించగలిగారు. 14 నెలల పాటు జిల్లాలో పనిచేశారు.



బదిలీపై వెళ్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్



6 లో

సాగులో పెరుగుతున్న డ్రోన్ల వినియోగం

- క్రిమి సంహారక మందుల స్ప్రే



6 లో

యూరియా కోసం..

- బారులు తీరిన రైతులు
- గంటల తరబడి నిరీక్షణ

నాగావళి నదిలోకి దూకిన మహిళ

- ఘటనా స్థలంలో ఉమ్మడి జిల్లాల పోలీసులు 7

అప్పులబాధ తాళలేక ఒకరి ఆత్మహత్య 7

మద్యం మత్తులో పీక కోసుకుని..

7
- ఎగువతాడికొండలో యువకుడి ఆత్మహత్య

నక్కదాడిలో నలుగురికి గాయాలు 7

నాలుగు మండలాల్లో మళ్లీ భూ సేకరణ



కొత్తవలస రైల్వే స్టేషన్

- ఈసారి కొత్తవలస నుంచి విజయనగరం వరకు నాలుగో రైల్వేలైన్
- గ్రామసభల ఏర్పాటు, నష్టపరిహారం తేల్చాలంటున్న స్థానికులు

కొత్తవలస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొత్తవలస చుట్టుపక్కల ప్రాంతాల్లో వరుస భూసేకరణలతో రైతులు అయోమయంలో పడుతున్నారు. భవిష్యత్‌లో కనీస స్థాయిలో సాగు భూమి ఉండదేమోనని సందేహిస్తున్నారు. కొంతకాలంగా పలు ప్రాజెక్టులకు వరుసగా భూ సేకరణ ప్రక్రియ జరుగుతోంది. భూములను కోల్పోతుంటే మళ్లీ మరో ప్రాజెక్టు తెరపైకి వస్తోంది. తాజాగా కొత్తవలస నుంచి విజయనగరం వరకు నాలుగో రైల్వే లైన్ కోసం భూసేకరణ తంతు ప్రారంభం కానుంది. ఈ విషయం తెలిసి నాలుగు మండలాల రైతులు టెన్షన్ పడుతున్నారు. గ్రామసభలు.. నష్టపరిహారం ప్రకటించకుండానే భూసేకరణకు ప్రయత్నిస్తున్నారని మండిపడుతున్నారు.

కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ, జామి మండలాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాల కోసం భూసేకరణలు జరుగుతున్నాయి. రెండు జాతీయ రహదారులు, సుజల స్రవంతి ప్రాజెక్టు కాలువ, రెండు ఆయిల్ కార్పొరేషన్‌ల పైప్‌లైన్‌లు వేయడానికి రైతుల నుంచి వరుసగా భూసేకరణ చేస్తుండగా తాజాగా కొత్తవలస నుంచి విజయనగరం వరకు 34.7 కిలోమీటర్ల మేర మరో కొత్త రైల్వే లైన్ ఏర్పాటు చేయడం కోసం ఈస్టు కోస్టు రైల్వే ఆధ్వర్యంలో భూ సేకరణకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఇందుకు సంబంధించి నోటిఫికేషన్ కూడా జారీ చేశారు. ఈ రైల్వే లైన్ కోసం కొత్తవలస, లక్కవరపుకోట, జామి, విజయనగరం రూరల్ మండలాల్లో భూములను సేకరించనున్నారు. కొత్తవలస నుంచి విజయనగరం వరకు మూడు రైల్వేలైన్‌లు, కొత్తవలస-కిరండోల్ రైల్వేలైన్‌తో పాటు కొత్తవలస నుంచి శృంగవరపుకోట వరకు రెండు రైల్వేలైన్‌లు ఉన్నాయి. ఇప్పుడు కొత్తవలస నుంచి విజయనగరం వరకు నాలుగో లైన్ ఏర్పాటు కోసం భూసేకరణ చేస్తున్నారు. నాలుగు మండలాల్లో 218.55 ఎకరాలను సేకరిస్తున్నారు. కొత్తవలస మండలంలోని కొత్తవలస, తుమ్మికాపల్లి, చిన్నిపాలెం, బలిఘట్టాం, నిమ్మలపాలెం గ్రామాల్లో సుమారు 78.35 ఎకరాలు, లక్కవరపుకోట మండలంలోని బీమాళి గ్రామంలో 10.16 ఎకరాలు, జామి మండలంలోని భీమసింగి, అన్నంరాజుపేట, మెఖాన కొత్తవలస, అలమండ, జి.సింగవరం గ్రామాలలో 144.24 ఎకరాల భూమిని, విజయనగరం రూరల్ మండలం జగన్నాథపురం గ్రామంలో 15.8 ఎకరాలను సేకరించడానికి నోటిఫికేషన్ ఇచ్చారు. నాలుగో రైల్వే లైన్ కోసం అవసరమైన భూమిలో ఇప్పటికే సర్వే పూర్తి చేశారు. యజమానుల నుంచి (మిగతా 8వ పేజీలో..)



భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు ఆయువుపట్టు

- విమానాశ్రయం పనులు 86 శాతం పూర్తి
- కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు

భోగాపురం, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): భోగాపురం అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయం ఉత్తరాంధ్రకే ఆయువుపట్టు అని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. నిర్మాణంలో ఉన్న భోగాపురం విమానాశ్రయాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. శరవేగంగా నిర్మాణం జరుగుతోందని, 14 నెలలకు ముందు 26శాతం ఉన్న ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులు ప్రస్తుతం 86శాతం పూర్తయ్యాయన్నారు. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి ప్రత్యేక చొరవతోనే సాధ్యమైందని చెప్పారు. భారతదేశంలో అనేక ఎయిర్‌పోర్టులు చూశానని, అందమైన ఎయిర్‌పోర్టులలో ఇదే ప్రథమంగా నిలుస్తుందన్నారు. ఈ 14 నెలల్లో 7 సార్లు స్వయంగా పరిశీలించానని, అన్ని పనులు నాణ్యతతో జరుగుతున్నాయని, వర్షాలు పడుతున్నా ఆటంకం కలగలేదన్నారు. ఈఏడాది జూన్‌లోనే ఇక్కడ విమానం ఎగిరే పరీక్ష చేపట్టామన్నారు. గత ప్రభుత్వం వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని బీచ్ కారిడార్ నమూనా తయారు చేశారని, ఈ ప్రభుత్వం మత్స్యకారులకు, వ్యాపారులకు, తీర ప్రాంత గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా బీచ్ కారిడార్ నిర్మాణం జరుగుతోందని అన్నారు. జాతీయ రహదారి సమీపంలోని ట్రంపెట్ పనులు వచ్చేనెల నుంచి (మిగతా 8వ పేజీలో..)



ఎయిర్‌పోర్టు పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, ఎంపీ కలిశెట్టి



6 లో

విద్యార్థులకు ఉపకారం

- పరీక్షలో ప్రతిభే ప్రామాణికం
- నాలుగేళ్ల పాటు ఎన్ఎంఎం స్కాలర్‌షిప్
- ఏడాదికి రూ.12వేలు చొప్పున సాయం
- ఈ నెల 30 వరకు దరఖాస్తుకు అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అర్హులు



క్లాప్‌మిత్రలకు వేతనాలు ఇవ్వలే!

రాజాం మండలంలో 80 మంది వరకూ క్లాప్‌మిత్రలు విధులు నిర్వహిస్తున్నారు. గత కొన్ని నెలలుగా వీరికి వేతనాలు చెల్లించడం లేదు.


- 15వ ఆర్థికసంఘం నిధుల సర్దుబాటుకు డీపీవో ఆదేశం
- వీటిని ఇతర పనులకు మళ్లిస్తున్న సర్పంచులు
- రూ.2.78 కోట్లు పెండింగ్..
- పారిశుధ్యంపై ప్రభావం

రాజాం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 27 మండలాల్లో 777 పంచాయతీల్లో 2024 మంది క్లాప్‌మిత్రాలు పనిచేస్తున్నారు. 250 ఇళ్లకు ఒక క్లాప్‌మిత్ర పనిచేయాల్సి ఉంటుంది. ఆపై చెత్త సేకరణ కేంద్రానికి తరలించడానికి మరొకరు అవసరం. అయితే చాలా పంచాయతీల్లో 2 నెలల నుంచి ఏడాది కాలంగా వేతనాలు అందించడం లేదు. ఇటీవల కొంతమొత్తంలో చెల్లింపులు జరిగాయి కానీ జిల్లా వ్యాప్తంగా రూ.2.78 కోట్ల బకాయిలు పేరుకుపోయినట్టు తెలుస్తోంది. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఇటీవల మంజూరయ్యాయి. వాటిని పారిశుధ్య కార్మికులకు జీతాల రూపంలో సర్దుబాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు కానీ సర్పంచ్‌లెవరూ పట్టించుకోవడం లేదు. సర్పంచ్‌ల (మిగతా 8వ పేజీలో..)

మొత్తం రూ.14.70 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఇటీవల విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులు నుంచి సర్దుబాటు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. సర్పంచ్‌లు పెడచెవిన పెడుతున్నారు. ఒక్కరాజాం మండలంలోనే కాదు. జిల్లా వ్యాప్తంగా క్లాప్‌మిత్రల జీతాలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. ఆ ప్రభావం పారిశుధ్య నిర్వహణపై పడుతోంది. జీతం లేని కొలువు ఎందుకంటూ ఎక్కువ మంది చెత్తను సేకరించడం లేదు.

డీఎస్సీ అభ్యర్థులకు 19న నియామక పత్రాలు

- ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌ల చేతుల మీదుగా అందజేత
- వెలగపూడిలో సచివాలయం సమీపాన అభినందన సభ
- ఉత్తరాంధ్రలోని 2,660 అభ్యర్థుల కోసం 118 బస్సులు ఏర్పాటు
- కార్యక్రమం ముగిసిన అనంతరం అభ్యర్థులకు పది రోజులపాటు శిక్షణ



విశాఖపట్నం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఉపాధ్యాయులుగా ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 19వ తేదీన అమరావతిలో నియామక పత్రాలు అందజేస్తారు. ఇందుకోసం వెలగపూడిలో సచివాలయం వెనుక అభినందన సభ ఏర్పాటుకు విద్యా శాఖ సన్నాహాలు చేస్తోంది. ఉత్తరాంధ్రలో 2,660 మందికి నియామక పత్రాలు అందజేస్తారు. ఉమ్మడి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీ, గురుకులాలు/మోడల్ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు తోడుగా కుటుంబ సభ్యుల్లో ఒకరిని అభినందన సభకు అనుమతిస్తారు. ఉత్తరాంధ్ర నుంచి అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను తీసుకువెళ్లడానికి సుమారు 120 బస్సులు ఏర్పాటుచేస్తున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి ఈనెల 18వ తేదీ ఉదయం బస్సులు బయలుదేరతాయి. ఆరోజు రాత్రికి విజయవాడ సమీపంలో వారికి వసతి ఏర్పాటుచేస్తారు. 19వ తేదీ ఉదయం అభినందన సభలో జిల్లాల నుంచి ఎంపిక చేసిన కొద్దిమందికి సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ఇతర ప్రముఖులు నియామక పత్రాలు అందజేస్తారు. మిగిలిన (మిగతా 8వ పేజీలో..)

విద్యార్థులకు ఉపకారం



- పరీక్షలో ప్రతిభే ప్రామాణికం
- నాలుగేళ్ల పాటు ఎన్ఎంఎం స్కాలర్‌షిప్
- ఏడాదికి రూ.12వేల చొప్పున సాయం
- ఈ నెల 30 వరకు దరఖాస్తుకు అవకాశం
- ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులే అర్హులు

రాజాం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తమ పిల్లలు ఉన్నత చదువులు చదివి... భవిష్యత్తులో మంచిగా స్థిరపడాలని తల్లిదండ్రులు కలలు కంటారు. పేదరికం కారణంగా వారి ఆశలు ఆడియాశలవుతున్నాయి. రూ.లక్షలు ఖర్చు చేసి చదివించే స్తోమత చాలా మందికి లేకపోవడంతో చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి. ఈ దుస్థితి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. దీనిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. 2008లో పేద పిల్లల కోసం నేషనల్ మీన్స్ కమ్‌మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఎనిమిదో తరగతి చదివే పిల్లలకు ఏటా పరీక్ష నిర్వహిస్తారు. అందులో ప్రతిభ కనబరిచే వారికి నాలుగేళ్ల పాటు ఉపకార వేతనం అందిస్తారు.



పరీక్ష విధానం ఇలా..

పరీక్ష మొత్తం ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 3 గంటల వ్యవధిలో 180 ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. రీజనింగ్, అర్థమెటిక్, మేథ్స్, సైన్స్, సోషల్ అంశాలకు సంబంధించి ప్రశ్నలు ఉంటాయి. పరీక్షలో ప్రతిభ చూపిన వారిని స్కాలర్‌షిప్‌నకు ఎంపిక చేస్తారు.

ఏడాదికి రూ.12 వేలు

కేంద్ర ప్రభుత్వం నిర్వహించే అర్హత పరీక్షలో ప్రతిభ చాటిన విద్యార్థులకు నెలకు రూ.వెయ్యి చొప్పున ఏడాదికి రూ.12వేల ఆర్థిక సాయం అందిస్తారు. తొమ్మిదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు నాలుగేళ్ల పాటు ఈ స్కాలర్ షిప్ అందుతుంది. నగదును విద్యార్థి ఖాతాలో జమ చేస్తారు. చదువుకోవాలనే పట్టుదల ఉండి... పేదరికం... ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఈ సాయం ఎంతగానో ఉపయోగపడుతుంది.

అర్హులు ఎవరంటే..

ప్రభుత్వ జిల్లా పరిషత్, ఎయిడెడ్, గురుకుల, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాయడానికి అర్హులు. వీరు ఆరు, ఏడు తరగతుల్లో 55శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 50 శాతం మార్కులు అర్హతగా నిర్ణయించారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.3.50 లక్షలు మించకూడదు. పాఠశాలలో రెగ్యులర్ విధానంలో విద్యార్థులు చదువుతుండాలి. నవోదయ, కేంద్రీయ విద్యాలయాల్లో చదివే వారు అనర్హులు, అలాగే ప్రైవేటు పాఠశాలల్లో చదివేవారు కూడా అనర్హులు.

విద్యార్థులను ప్రోత్సహించాలి

అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా ఆసక్తిని కనబరచాలి. ఎక్కువ మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చొరవ చూపాలి. ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాన్ని పొందేందుకు విద్యార్థులు పోటీపడాలి. ఈ పరీక్ష విద్యార్థులలో పోటీతత్వాన్ని పెంచుతుంది. దీన్ని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి.

- మాణిక్యం నాయుడు, డీఈవో, విజయనగరం

దరఖాస్తు ఎలాగంటే..

నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ కోసం 2025-26 విద్యా సంవత్సరానికి దరఖాస్తులను ప్రభుత్వం ఆహ్వానిస్తోంది. దరఖాస్తు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. ఈనెల 30వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తు చేసుకోవాడానికి ఓసీ, బీసీ విద్యార్థులైతే పరీక్షల రుసుంగా రూ.10 చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాలి. పరీక్షా రుసుం ఆన్‌లైన్ అప్లికేషన్‌లో ఇచ్చిన ఎస్‌బీఐ కలెక్ట్ లింక్ ద్వారా మాత్రమే చెల్లించాల్సి ఉంది. డిసెంబరు 7న పరీక్ష నిర్వహిస్తారు. ఈ ఏడాది జరగనున్న ప్రవేశ పరీక్షకు సంబంధించి ఇప్పటికే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు.



డ్రోన్‌తో క్రిమి సంహారక మందును చల్లుతున్న దృశ్యం

సాగులో పెరుగుతున్న డ్రోన్ల వినియోగం

- క్రిమి సంహారక మందుల స్ప్రే

సీతానగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు ఇప్పుడిప్పుడే సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నారు. ఆధునిక వ్యవసాయ విధానాలపై దృష్టి పెడుతున్నారు. కూలీల కొరత కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో డ్రోన్ సాయంతో ఎరువులు, క్రిమి సంహారక మందులను పంట పొలాల్లో స్ప్రే చేస్తున్నారు. దీంతో సమయం ఆదా అవుతుందని అంటున్నారు. శనివారం బూర్జ, సూరంపేట, మరిపివలస, కృష్ణారాయపురం గ్రామాల్లో డ్రోన్లతో క్రిమి సంహారక మందులను స్ప్రే చేయించారు. మండలంలో ఎదలు ద్వారా 3,600 ఎకరాలు, సాధారణ పద్ధతిలో 13,200 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. చెరకు 800 ఎకరాలు, పత్తి పంట 800, మొక్కజొన్న 400 ఎకరాల విస్తీర్ణంలో సాగులో ఉన్నాయి. పంటల సాగుకు కూలీల బెడద ఎక్కువగా ఉండటంతో పాటు క్రిమి సంహారక మందులు స్ప్రే చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో సకాలంలో ఎరువులు, మందులు పిచికారీ చేయలేని పరిస్థితి ఉంటోంది. తాజాగా బూర్జ గ్రామానికి చెందిన నాయుడు ఫెర్టిలైజర్స్ ప్రతినిధి డ్రోన్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. రైతులు నానో యూరియా, డీఏపీ ఎరువును డ్రోన్‌తో తక్కువ ఖర్చుతో స్ప్రే చేయించారు. వరిలో దోమ పోటు, ఆకు ముడత తెగులు, కాండం తొలుచు పురుగులు చేరడంతో ఆందోళన చెందుతున్న రైతులకు డ్రోన్ వరంగా మారింది. డ్రోన్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో ఎరువులు, మందులు వేయగలుగుతున్నారు



ప్రధాన రహదారిపై నిలిచిన వరదనీరు

పార్వతీపురంలో భారీ వర్షం

- వీధులన్నీ జలమయం

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణంలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం 2.30 నుంచి 3 గంటల వరకు వర్షం కురిసింది. ఉదయం 8 గంటల నుంచి ఆకాశం మేఘావృతమైంది. దీంతో వర్షం వస్తుందని ప్రజలు అప్రమత్తమయ్యారు. ఉదయం 10 గంటల తరువాత తీవ్రమైన ఎండ కాసింది. ఉక్కపోతతో పట్టణ వాసులు ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి వాతావరణంలో మళ్లీ మార్పులు చోటుచేసుకున్నాయి. భారీ వర్షం కురిసింది. వీధులు, రోడ్లు జలమయమయ్యాయి. మేదర వీధి నుంచి చిన్నకుమ్మరి వీధి వరకు ప్రధాన రహదారిపై వరదనీరు నిలిచిపోయింది. ఆ నీటిలో పాదచారులు, వాహన చోదకులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో రైతులు మాత్రం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సంతకవిటి: యూరియా బస్తాల కోసం భారీ సంఖ్యలో వేచి ఉన్న రైతులు

యూరియా కోసం..

- బారులు తీరిన రైతులు
- గంటల తరబడి నిరీక్షణ

సంతకవిటి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కోరమాండల్ (మన గ్రోమోర్) దుకాణం వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. వరినాట్లు వేసి 50 రోజులు దాటడం ....ఇంకా యూరియా అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం 15 టన్నుల యూరియా వచ్చింది. దీంతో సిబ్బంది యూరియా పంపిణీ చేయడానికి శనివారం ఉదయం షాపు తెరిచేసరికే రైతులు బారులు తీరారు. స్టాక్ ఉన్నంత వరకు శనివారం పంపిణీ చేశారు. శనివారం మరో 15 టన్నులు అదే కోరమాండల్‌కి వచ్చింది. రైతుల పేర్లు నమోదు చేసుకొని, వారికి సోమవారం ఉదయం పంపిణీ చేస్తామని ఏవో యశ్వంత్ కుమార్ తెలిపారు. పోలీసుల సహకారంతో పంపిణీ సజావుగా సాగుతోందన్నారు. సురవరం గ్రామంలో శనివారం యూరియా పంపిణీ ప్రారంభించారు. ఒక్కొక్క రైతుకు ఒక్కో బస్తా చొప్పున ఇస్తామని చెప్పారు. దీని పై కొంతమంది రైతులు మాట్లాడుతూ వారి పంట విస్తీర్ణానికి సరిపడా యూరియా అందజేయాలని కోరారు. అలా పంపిణీ చేస్తే అందరికీ సరిపడవని అధికారులు తెలిపారు. దీంతో రైతులు అందరూ కలసి పంపిణీని వాయిదా వేయాలని కోరారు. రైతులకు కోరిక మేరకు సోమవారం పంపిణీ చేస్తామని ఏవో యశ్వంత్‌రావు తెలిపారు.

రైతుల మధ్య తోపులాట

గుర్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గుర్లలో శనివారం రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఉదయం నుంచి వివిధ గ్రామాల నుంచి రైతులు రావడంతో ఒక్కసారిగా తోపులాట ప్రారంభమైంది. రైతులంతా రోడ్డెక్కారు. యూరియా కోసం కేకలు అరుపులతో ఆ ప్రాంతమంతా గందరగోళంగా మారింది. క్యూలైన్‌లో నిల్చోకుండా ఇబ్బందులు పడ్డారు. కొంతసేపటికి పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను చెదరగొట్టారు. పోలీసుల సమక్షంలో యూరియాను పంపిణీ చేశారు



యూరియా పంపిణీ కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

రోడ్డెక్కిన అన్నదాతలు

రాజాం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యూరియా కోసం శనివారం రాజాంలో రైతులు రోడ్డెక్కారు. రాజాం-శ్రీకాకుళం రోడ్డులో ఎల్.ఐ.సి. కార్యాలయం సమీపంలో ప్రధాన రహదారిని దిగ్బంధించారు. రైతులకు సరిపడినంత యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సుమారు రెండు గంటల పాటు ఆందోళనకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్లిప్పులిచ్చి తిప్పించుకుంటున్నారే తప్ప యూరియా ఇవ్వడం లేదని రైతులు ఆరోపించారు. ఇచ్చిన వారికే మళ్లీ మళ్లీ ఇస్తున్నారని ధ్వజమెత్తారు. మూడు రోజులుగా ఉదయం ఆరు గంటలకే కేంద్రం వద్దకు వచ్చినా డీలర్లు మాత్రం పది గంటలకు వస్తున్నారని... ఒక్క బస్తా కూడా అందడం లేదని రైతులు ఆరోపించారు. సుమా రు రెండు గంటల పాటు వాహనాలను నిలిపివేడయంతో ఇరువైపులా కిలో మీటరు మేర బారులు తీరాయి. ద్విచక్ర వాహనాలను కూడా ముందుకు కదలనివ్వకుండా రైతులు భీష్మించుకు కూర్చున్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. పరిస్థితి తెలుసుకు న్న రాజాం సీఐ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్.ఐ. శేఖర్ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకున్నారు. రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయినాసరే రైతులు ససేమిరా అంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఎట్టకేలకు ఎస్ఐ శేఖర్‌తో పాటు పోలీసులు రైతులను ఒప్పించి... యూ రియా కేంద్రానికి చేరుకుని పరిస్థితిని సద్దుమణిగించేందుకు కృషి చేశారు. ఇదిలా ఉంటే పట్టణంలోని మెయిన్ రోడ్డు, పాత బస్టాండ్, పాలకొండ రోడ్డు, చీపురుపల్లి రోడ్లలోని డీలర్ల వద్ద శనివారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. తీవ్ర అవస్థలకు గురయ్యారు.



యూరియా కేంద్రం వద్ద బారులు తీరిన రైతులు

యువత సేవలను వినియోగించుకోవడం లేదు

- ఎన్‌జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్
- ఘనంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువత సేవలను ప్రభుత్వాలు సక్రమంగా వినియోగించుకోవడం లేదని ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు శనివారం జడ్పీ సమావేశ భవనంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మహాసభల ప్రారంభ సూచికగా జాతీయ జెండాను రచయిత అట్టాడ అప్పలనాయుడు, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి సింహాద్రినాయుడు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్‌జీఓ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ అక్షరాస్యత పెరిగినప్పటికీ దేశం ఇంకా వెనుకబడి ఉండడం దారుణమన్నారు. నాలుగో ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ దేశంలోని యువతను సక్రమంగా వినియోగించుకునే పరిస్థితి రాలేదన్నారు. మానవతా విలువలు, శాస్త్రీయ దృక్పథం ఉండాలని రాజ్యాంగం చెప్పిందని గుర్తు చేశారు. అదే మార్గంలో జేవీవీ నడుస్తోందన్నారు. మనలో ప్రశ్నించే గుణం పెరగాలని సూచించారు. ప్రశ్నించని బతుకు గడ్డిపరకతో సమానమన్నారు. ఎన్‌జీవో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీవీ రమణ మాట్లాడుతూ ఇది ఉత్తరాంధ్ర కాదు ఉత్తమాంధ్ర అని కొనియాడారు. బ్రిటీషు సేనలను మూడు చెరువుల నీరు తాగించిన అల్లూరి సీతారామరాజు నడయాడిన ప్రాంతమని... ప్రగతిశీల భావాలు కలిగినది ఉత్తరాంధ్రేనన్నారు. ప్రస్తుత సమాజానికి జన విజ్ఞాన వేదిక సేవలు అవసరమని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా జేవీవీ రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధులు

తీర్మానాలకు ఆమోదం

జన విజ్ఞాన వేదిక వివిధ తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించింది. ముఖ్యంగా గురజాడ గృహాన్ని అభివృద్ధి చేయాలని... సందర్శకులు వచ్చి అక్కడ అంతా పరిశీలించే విధంగా ఏర్పాట్లు చేయాలని తీర్మానం చేశారు. గురజాడ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించాలన్నారు. గురజాడ పేరిట విజయనగరంలో సాంస్కృతిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తీర్మానించారు. దీనికి సభ్యులంతా ఏకగ్రీవంగా ఆమోదించారు.

గాలికుంటు వ్యాధిని అరికట్టాలి

- కలెక్టర్ రామసుందర్ రెడ్డి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గాలి కుంటు వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి ఆదేశించారు. ఈ నెల 15 నుంచి అక్టోబరు 15 వరకూ నిర్వహించే గాలికుంటు వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించి వాల్‌పోస్టర్‌ను తన చాంబర్‌లో శనివారం కలెక్టర్ ఆవిష్కరించారు. జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా నెల రోజుల పాటు టీకాలను పశువులకు వేయడం ద్వారా ఈ వ్యాధిని నిరోధించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ ఇన్‌చార్జి జేడీ దామోధరరావు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి తదితరులు

17 నుంచి విశ్వకర్మ జయంతి ఉత్సవాలు

చీపురుపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17 నుంచి 22 వరకూ పట్టణంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు మారోజు చక్రధర్, ప్రధాన కార్యదర్శి పట్నాన ఈశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు కరపత్రాన్ని విడుదల చేశారు. పట్టణంలోని హడ్కో కాలనీలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆలయ పురోహితులు జాడ అప్పారావు, కందికుప్ప సురేష్ ఆచారి ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు కార్యక్రమాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు సర్వశెట్టి భాస్కరరావు, కొచ్చెర్ల రామకృష్ణ పాల్గొన్నారు.

చెత్తను తరలించారు



చెత్త తీయిస్తున్న దృశ్యం

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొడ్డవర గ్రామం వద్ద విశాఖ-అరకు ప్రధాన రహదారి పక్కనే చెత్త వేస్తున్నారని.. నిర్వహణ లేక సంపద సృష్టించలేక అంటూ రెండు రోజుల కిందట ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమయ్యింది.దీనిపై పంచాయతీ అధికారులు స్పందించారు. శనివారం ప్రత్యేకంగా వాహనాన్ని ఏర్పాటు చేయించి, చెత్తను డంపింగ్‌యార్డ్‌కు తరలించారు.

ఎరువులను అధిక ధరకు అమ్మితే చర్యలు

వేపాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరకు అమ్మిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని విజిలెన్స్ సీఐ బి.సింహాచలం హెచ్చరించారు. శనివారం ఆయన మండలంలోని ఎరువుల దుకాణాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలపరిమితి అయిపోయిన పురుగు మందులు విక్రయిస్తే ఆ షాప్ యజమానిపై క్రిమినల్ కేసు పెడతామన్నారు. ఏవో స్వాతి, హెడ్ కానిస్టేబుల్ కామేశ్వరరావు పాల్గొన్నారు.

క్రమశిక్షణే విద్యాభివృద్ధికి మొదటి మెట్టు

లక్కవరపుకోట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణే విద్యాభివృద్ధికి మొదటి మెట్టు అని ఎమ్మెల్యే లలితకుమారి అన్నారు. సుపథ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ఎల్‌కోటలో పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గీతాలు, వ్యాసరచన తదితర అంశాలపై పోటీలు నిర్వహించారు. సుమారు 30 పాఠశాలల నుంచి 500 విద్యార్థులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, విజేతలకు బహుమతులు అందజేశారు. సుపథ వ్యవస్థాపకుడు వీఏఎన్.రాజు, నిర్వాహకుడు శ్రీహరిశర్మ, ఎంఈవో కూర్మారావు పాల్గొన్నారు.

బీజేపీ జాతీయ అధ్యక్షుడి పర్యటన జయప్రదం చేయండి

రాజాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విశాఖ పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ పట్టణ అధ్యక్షుడు జొన్నాడ రంజిత్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆదివారం విశాఖలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నారని తెలిపారు.

రైతుల ప్రయోజనాల కోసం కృషి చేయాలి

రాజాం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ రైతుల ప్రయోజనాల కోసం కృషి చేయాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర నాయకుడు ఎ.వీరభద్రయ్య, శ్రీకాకుళం జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బత్తుల పవన్ సాయి.. రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ కోటగిరి నారాయణరావును కోరారు. ఇటీవల నారాయణరావు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన్ని వారిద్దరూ శనివారం కలిసి, అభినందించారు.

మత విద్వేషాలు వద్దు

మెరకముడిదాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): హిందువులు, క్రైస్తవులు మత విద్వేషాలకు పోకుండా సోదరభావంతో కలిసిమెలసి ఉండాలని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు సూచించారు. శనివారం బుదరాయవలస పోలీసుస్టేషన్‌లో మండలంలోని పలు గ్రామాలకు చెందిన హిందూ, క్రైస్తవ పెద్దలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎక్కువ శబ్దంతో మత ప్రచారాలు చేయవద్దని, ఒకరికొకరు సహకరించుకోవాలని కోరారు. చీపురుపల్లి సీఐ శంకరరావు, బుదరాయవలస ఎస్ఐ జె.లోకేష్ కుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు

నెల్లిమర్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భోగాపురం సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సతివాడ గ్రామంలో ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రధాన కూడలిలో మోడల్ స్కూల్ వద్ద రెండు, సతివాడ ఎస్సీ కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద రెండు, సతివాడ రామమందిరం వద్ద మరొక రెండు కెమెరాలు అమర్చారు.

నేడు ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్ పోటీలు

కొత్తవలస, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి గేట్ వద్ద మెగా యూత్ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉత్తరాంధ్ర స్థాయి క్విజ్‌పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ పోటీలలో విజేత గ్రూపులకు రూ.8వేలు, రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేల చొప్పున నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

ప్రభుత్వ స్థలం అంటే ఇంత నిర్లక్ష్యమా?

- నిరుపయోగంగా ఇరిగేషన్ భవనం
- ఎవరు పట్టించుకోని వైనం

గజపతినగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన ఆ ప్రభుత్వ భవనం ఏళ్ల తరబడి వినియోగంలో లేకపోవడంతో నిరుపయోగంగా దర్శనమిస్తోంది. పైగా శిథిలావస్థకు చేరుకుంది. పురిటిపెంట పంచాయతీ మామిడిబంద కాలనీలో 1981-82 సంవత్సర కాలంలో ఇరిగేషన్ కార్యాలయం నిర్మాణం చేపట్టారు. అప్పట్లో ఇరిగేషన్ డీఈలతో పాటు ఏఈలు అందరూ ఇక్కడ నుంచి విధులు నిర్వహించే వారు. కాలానుగుణంగా అధికారులు ఇతర ప్రదేశాలకు బదిలీలపై వెళ్లిపోవడం, ఇక్కడకు అధికారులు వచ్చేందుకు సుముఖత చూపకపోవడంతో కార్యాలయం బోసిపోయింది. 2014-19 టీడీపీ హయాంలో ఈ కార్యాలయాన్ని ఉచిత కుట్టు మిషన్ అందించే శిక్షణ కార్యాలయంగా.. ఆ తర్వాత లబ్ధిదారులకు ఆదరణ పరికరాలు అందించేందుకు వినియోగించేవారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవనాన్ని పట్టించుకోలేదు. దీంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. ఈక్రమంలో కార్యాలయం పక్కనగల ఖాళీ స్థలం ఆక్రమణకు గురవుతోందని, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వినియోగంలోకి తీసుకురండి

మండలంలోని ప్రభుత్వ సమావేశాలకు అనువైన ప్రదేశం లేకుండా పోయింది. ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు సమావేశాల నిర్వహణకు సరిపోవడం లేదు. జిల్లా స్థాయి అధికారుల సమావేశాలు జరగాలంటే పట్టణంలో గల కల్యాణ మండపాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న ఇరిగేషన్ భవనాన్ని తొలగించి ఆ ప్రదేశంలో నూతన భవనాన్ని నిర్మిస్తే సమావేశాలకు వినియోగించుకోవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పేదలు ప్రభుత్వ కల్యాణమండపం లేక అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని కల్యాణ మండపాలను ఆశ్రయించాల్సి వస్తోంది. మండప నిర్వాహకులు అడిగినంత ఇచ్చుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ముందడుగు వేసి శిథిలావస్థలో ఉన్న ఇటువంటి భవనాలను వినియోగంలోకి తీసుకువచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని మండవాసులు కోరుతున్నారు.


శిథిలావస్థలో ఇరిగేషన్ కార్యాలయ భవనం

లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలి

మెరకముడిదాం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. గర్భాం పంచాయతీ పెదమంత్రిపేటలో ఎస్ మేనేజ్మెంట్ అండ్ ఎస్ ఇండియా గ్రామీణ విద్యా సంస్థలు, శ్రీరామా సేవా కమిటీ ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సంఘ సేవకుడు మంత్రి శ్రీరాములునాయుడు శత జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై, శ్రీరాములునాయుడు సేవలను కొనియాడారు. సాసుబిల్లి హర శ్రీరాములు, టీడీపీ మండల అధ్యక్షుడు తాడ్డి సన్యాసినాయుడు, మాజీ ఎంపీపీ కోట్ల మోతీలాల్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ తాడ్డి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం మంజూరు చేయండి

భోగాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సుమారు 400 ఎకరాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వవలసి ఉందని స్థానిక నాయకులు నీలాపు అప్పలరామి రెడ్డి, కోరాడ తాతారావులు శనివారం ఎయిర్‌పోర్టు పరిశీలనకు వచ్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

దళిత రణభేరిని విజయవంతం చేయాలి

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనూ, దేశంలోనూ దళితులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈనెల 24న విజయవాడలోని ధర్నాచౌక్‌లో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దళిత రణభేరీ సభకు జిల్లా నుంచి భారీఎత్తున దళిత సంఘాల నేతలు, దళితులు హాజరు కావాలని డీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి జోన్-1 ఇన్‌చార్జి సోము రాంబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం కంటోన్మెంట్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేశారు. పార్టీ నాయకులు శివప్రసాద్, బుద్దుడు, గౌరీ, పైడిరాజు పాల్గొన్నారు.

ఢిల్లీ పర్యటన పోరాట స్ఫూర్తిని నింపింది


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ పర్యటన తమలో రెట్టింపు పోరాట స్ఫూర్తిని నింపిందని జిందాల్ నిర్వాసితులు అన్నారు. శనివారం ఉదయం వీరు ఢిల్లీ నుంచి జిల్లాకు చేరుకున్నారు. ఈ మేరకు బొడ్డవర గ్రామంలో జిల్లా రైతు సంఘ ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు పాల్గొని, మాట్లాడారు. ఢిల్లీలో నిరసన సమయంలో అక్కడి పోలీసులు చూపించిన మర్యాద తమ గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. త్వరలో చలో అమరావతి నిర్వహిస్తామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల డెప్యూటేషన్ చూస్తే ఇక్కడి అధికారులు జిందాల్‌కు ఎంతసేవ చేస్తున్నారో తెలుస్తుందన్నారు.

దళితులపై దాడి తగదు

నెల్లిమర్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సతివాడ గ్రామంలో దళితులపై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించి, అరెస్టు చేయాలని జైభీమ్ పార్టీ అధ్యక్షుడు టొంపల నరసయ్య, పార్టీ ప్రధాన కార్యదర్శి కనిగిరి శ్రీను డిమాండ్ చేశారు. శనివారం నెల్లిమర్లలో వారు విలేకర్లతో మాట్లాడారు. వినాయకచవితి నిమజ్జనం సందర్భంగా సతివాడలో ఎస్సీలపై ఆ గ్రామానికి చెందినవారు దాడిచేయడం హేయమైన చర్య అన్నారు. వారం రోజులు అయినప్పటికీ నిందితులను అరెస్టు చేయకపోడవం దుర్మార్గం అన్నారు. ఎయిమ్ మండల కమిటీ కన్వీనర్ అప్పలరాజు, బాలచ్చి, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

విజయనగరం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నూతన కలెక్టర్ రామసుందరరెడ్డిని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అభివృద్ధికి, విజయనగరం నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఈసందర్భంగా ఆయన్ని కోరారు. ● కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన రామసుందర రెడ్డిని ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సభ్యులు శనివారం కలిసి, పుష్పగుచ్ఛాలు అందించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.జోగారావు, చిప్పాడ సూరిబాబులతో పాటు రవి, లక్ష్మణరావు, రాంబాబు ఉన్నారు.


నూతన కలెక్టర్ రామసుందరరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి, ఎస్టీయూ సంఘ నాయకులు

ఆటోల బంద్ విజయవంతం చేయండి

చీపురుపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ఈనెల 17న జరుగనున్న ఆటోల బంద్‌ను విజయవంతం చేయాలని ఆటో డ్రైవర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి నారాయణరావు, జిల్లా అధ్యక్షుడు నీలాపు అప్పలరాజురెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు శనివారం చీపురుపల్లిలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ మహిళల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు పథకాన్ని ప్రవేశపెట్టడం వల్ల ఆటో కార్మికులు తమ ఉపాధిని కోల్పోయారన్నారు. తమ ఉపాధికి ఎటువంటి ఆటంకం లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ ప్రతినిధి అంబల్ల గౌరినాయుడు, స్థానిక ఆటో వర్కర్ల సంఘం ప్రతినిధులు పండూరి తాతాజీ, మాడుగుల రమణ, జగదీష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న ఆటో కార్మికులు

జేఎన్‌టీయూలో ఫార్మసీ కళాశాల ప్రారంభానికి అనుమతులు

వియనగరం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నగర శివారులోని జేఎన్‌టీయూ గురజాడలో ఫార్మశీ కళాశాలను ప్రారంభించేందుకు ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు చేశారని, అక్టోబరు నుంచి కళాశాల ప్రారంభమవుతుందని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా కొన్ని సర్టిఫికేషన్ కోర్సులు, ఫార్మశీ కోర్సులు, ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాల్లో సర్టిఫికేషన్ కోర్సు ఆన్‌లైన్ విధానంలో ఎమర్జంగ్ టెక్నాలజీస్ మూడు నెలలు, ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ టూల్స్ ఒక నెల, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్ ఒక నెల, ఇంటర్నెట్ ఆఫ్థింగ్స్ ఒక నెల, సైబర్ సెక్యూరిటీ ఒక నెల, క్వాంటమ్ కంప్యూటింగ్ ఒక నెల.. తదితర కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 77803 51078 నెంబరును సంప్రదించాలన్నారు.

కలెక్టర్‌కు ఘన వీడ్కోలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా ఇప్పటి వరకూ బాధ్యతలు చేపట్టిన డా.బీఆర్ అంబేడ్కర్‌కు పౌర సంఘాల నాయకులు శనివారం ఆయన బంగ్లాలో ఘనంగా వీడ్కోలు పలికారు. జిల్లా నుంచి బదిలీ అయిన నేపథ్యంలో పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గాడి తప్పిన అధికారులను గాడిలో పెట్టడం, శాఖల వారీగా లోపాలు సరిదిద్దే ప్రయత్నం చేయడంతో మంచి గుర్తింపు పొందారన్నారు. రాము, పార్వతి, రాజు, వరలక్ష్మి, నర్సయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్ అంబేడ్కర్‌ని సత్కరిస్తున్న పౌర సంఘాల నేతలు

ఉద్యోగుల పీఆర్సీ, పెండింగ్ డీఏలను విడుదల చేయాలి

విజయనగరం సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పెండింగ్ పీఆర్‌సీ, డీఏలను తక్షణమే విడుదల చేయాలని ఏపీ ఎన్జీవో జేఏసీ చైర్మన్ ఎ.విద్యాసాగర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఏపీ ఎన్జీవో కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తాలుకా యూనిట్ స్థాయిలో ఉన్న అధ్యక్ష, కార్యదర్శులు ప్రతి ఉద్యోగిని కలిసి సభ్యత్వాన్ని చేయించి ఎన్నికలు జరుపుకుని వ్యవస్థాగతంగా క్షేత్ర స్థాయిలో ఎన్జీవో సంఘాన్ని పటిష్టం చేయాలన్నారు. పదవీ విరమణ చేసిన బీహెచ్‌ఎస్‌ఆర్ ప్రభూజీ, ఏపీ ఎన్జీవోలో నిబద్ధతతో విశిష్ట సేవలు అందించారన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఉద్యోగ సమస్యలపై పోరాడి గళమెత్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో నాయకులు డీవీ రమణ, పురుషోత్తం నాయుడు, శ్రీధర్‌బాబు, సురేష్, కిషోర్, ఆనందకుమార్, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు పెద్దింటి అప్పారావుతో పాటు మహిళా విభాగం నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎన్జీవో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

కొత్తవలసలో 223 రాజీ

కొత్తవలస, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తవలస కోర్టులో శనివారం న్యాయాధికారి సముద్రాల విజయ్‌చందర్ ఆధ్వర్యంలో మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ మెగా లోక్ అదాలత్‌లో సివిల్, క్రిమినల్‌కు సంబంధించి 223 కేసులను రాజీ చేశారు. కొత్తవలస, లక్కవరపుకోట, వేపాడ మండలాల పోలీసు స్టేషన్ పరిధిలో గల క్రిమినల్ కేసులను కొత్తవలస ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల కేసులను రాజీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ ఎంవీఎస్ గిరిబాబుతోపాటు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



రాజాం రూరల్: కక్షిదారులతో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి శారదాంభ

రాజాంలో 419..

రాజాం రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 419 కేసులు పరిష్కరించారు. మండల న్యాయసేవా సంస్థ అధ్యక్షురాలు, సీనియర్ న్యాయాధికారి కె.శారదాంభ, జూనియర్ సివిల్ న్యాయాధికారి సీహెచ్.హరిప్రియ సారథ్యంలో రెండు బెంచ్‌లను ఏర్పాటు చేయడం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించారు. వీటిలో నాలుగు సివిల్ కేసులు, ఏడు భార్యాభర్తల తగాదాలకు సంబంధించిన కేసులు, 50 క్రిమినల్ కేసులు, రెండు చెక్‌బౌన్స్ కేసులు, మూడు సారా కేసులు, 353 పెట్టీ కేసులు ఉన్నాయని కోర్టువర్గాలు వెల్లడించాయి. 419 కేసులకు సంబంధించి పరిష్కరించిన మొత్తం రూ.69,76,328గా కోర్టు వర్గాలు పేర్కొన్నాయి. అదాలత్‌లో న్యాయవాదులు తిరుపతినాయుడు, రమణమూర్తి, పోలారావు, పోలీస్, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.


గజపతినగరం: కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారి విజయ్‌రాజ్‌కుమార్

గజపతినగరంలో 577..

గజపతినగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 577 కేసులు పరిష్కారం అయినట్టు న్యాయాధికారి ఎ.విజయ్‌రాజ్‌కుమార్ తెలిపారు. నియోజకవర్గం పరిధిలోగల గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి మండలాలతో పాటు మెంటాడ మండలానికి చెందిన వివిధ కేసులకు సంబంధించి రాజీ పడినట్టు తెలిపారు.

నాగావళి నదిలోకి దూకిన మహిళ

- ఘటనా స్థలంలో ఉమ్మడి జిల్లాల పోలీసులు

పాలకొండ / రేగిడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ మండలంలోని గొట్టమంగళాపురం సమీపంలో నాగావళి నదిపై ఉన్న వంతెనపై నుంచి శనివారం సాయంత్రం 6.30 గంటల సమయంలో గుర్తుతెలియని ఓ మహిళ దూకినట్లు సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. నదీతీరం పార్వతీపురం మన్యం జిల్లాతోపాటు విజయనగరం జిల్లా పరిధిలో ఉన్న రేగిడి ఆమదాలవలసకు అనుసంధానంగా ఉంది. ఈ క్రమంలో ఇరుజిల్లాలకు చెందిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. సాయంత్రం సుమారు 35 ఏళ్ల మహిళ వంతెన పైనుంచి నదిలోకి దూకింది. అక్కడకు సమీపంలోఉన్న కొందరితోపాటు పాలకొండ వస్తు న్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ కూడా ఈ ఘటనను గుర్తించారు. కొద్దిరోజులుగా వర్షాలు కురుస్తుండడంతో నదిలో నీరు ఉధృతి అధికంగా ఉంది. ఆమె దూకిన క్షణాల వ్యవధిలో నదీ ప్రవాహంలో కొట్టుకుపోయినట్టు చూసిన వారు పోలీసు లకు సమాచారం అందించారు. దీంతో పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పోలీసులు, పాలకొండ అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు వెతికారు. చీకటిపడడంతో అందరూ వెనుదిరిగారు. నదిలో దూకిన మహిళ వివరాలు తెలియరాలేదు. వంతెన వద్ద చెప్పులు మాత్రమే ఉన్నట్టు పోలీసులు పేర్కొంటున్నారు.

మద్యం మత్తులో పీక కోసుకుని..

- ఎగువతాడికొండలో యువకుడి ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎగువతాడికొండ గ్రామానికి చెందిన ఆరిక చంద్రశేఖర్ (32) మద్యం మత్తులో చాకుతో పీక కోసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎల్విన్‌పేట ఎస్ఐ బి.శివ ప్రసాద్ కథనం మేరకు.. పుట్టుకతో చెవిటి, మూగ అయిన చంద్రశేఖర్ తాగుడికి బానిసయ్యా డు. అప్పుడప్పుడు తాగిన మైకంలో పిచ్చిపిచ్చిగా వ్యవహరిస్తాడు. కురుపాం మండలంలోని తెన్నుఖర్జలోని చెల్లి ఇంటికి వెళ్లి కూడా అలాగే తాగి వ్యవహరిం చాడు. ఆమె మందలించడంతో ఎగువ తాడికొండకు మూడు రోజుల కిందట వచ్చాడు. ఎప్పటిలాగే శుక్రవారం కూడా ఎక్కువగా సేవించాడు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో మత్తులో గొంతును చాకుతో కోసుకున్నాడు. అధిక రక్తస్రావంతో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు తాడికొండలోని పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక వైద్య సేవలు అనంతరం భద్రగిరి సీహెచ్‌సీ కి అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం పార్వతీపురం ఆసుపత్రికి రిఫర్ చే శారు. అక్కడకు చేరిన వెంటనే కొద్దిసేపటికే చంద్రశేఖర్ మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. చంద్రశేఖర్ తల్లిదండ్రులు చిన్నప్పుడే మృతిచెందారు. అన్న కిషోర్‌తో కలిసి ఎగువ తాడికొండలో జీవిస్తున్నాడు.

అప్పుల బాధ తాళలేక ఒకరు..


సాయిసురేష్ (ఫైల్)

బొబ్బిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలిలోని సింగారపు వీధికి చెందిన సిరిపురపు సాయిసురేష్ (25) శనివారం ఆత్మహత్య చేసుకున్నారు. ఈ ఘటనపై సీఐ కటకం సతీష్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సాయిసురేష్ విద్యుత్ శాఖలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. ఆయన తండ్రి విద్యుత్ శాఖలో పనిచేసి మృతి చెందడంతో ఆ ఉద్యోగాన్ని సాయిసురేష్ తల్లి ఆదిలక్ష్మికి ఇచ్చారు. ఆమె కూడా పార్వతీపురం విద్యుత్ కార్యాలయంలో పనిచేస్తోంది. సాయిసురేష్‌కు అప్పులు ఎక్కువగా ఉండడంతో ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. దీంతో వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సాయిసురేష్‌కు తమ్ముడు రవితేజ ఉన్నాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలియగానే ఎమ్మెల్యే బేబీనాయన ఆసుపత్రికి వెళ్లి సాయిసురేష్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

చెరువులో జారిపడి వ్యక్తి మృతి

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగారాయపురం గ్రామానికి చెందిన గొల్లపల్లి ప్రసాదు(45) శనివారం చెరువులో కాలు జారి పడి మృతిచెందారు. ఆయన ఉదయం గ్రామానికి సమీపంలో ఉన్న చెరువుకు బహిర్భూమికి వెళ్లారు. కడుక్కోవడానికి ప్రయత్నిస్తుండగా కాలుజారి పడి మృతిచెందారు. ఈ మేరకు సోదరుడు ఈశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు హెడ్ కానిస్టేబుల్ కాశీరావు తెలిపారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్టు

పూసపాటిరేగ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గతంలో పలు దొంగతనాలకు పాల్పడిన ఇద్దరు యువకులను స్థానిక పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మండలంలోని కనిమెళ్ల గ్రామంలో గల అమ్మవారి కోవెలలో దొంగతనానికి పాల్పడటంతోపాటు కోనాడ, పేరాపురం గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు దొంగలించినట్లు స్థానిక ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలీసులు గత కొన్ని రోజులుగా దర్యాప్తు చేస్తున్నారు. శనివారం కామవరం జంక్షన్ వద్ద వీరు ఉన్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి, వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్ఐ తెలిపారు. అదుపులోకి తీసుకున్నవారిలో ఒక యువకుడు కనిమెళ్ల గ్రామానికి చెందిన దుర్గాశి శ్రీనివాసరావు, రెండో వ్యక్తి పైడిభీమవరం గ్రామానికి చెందిన కలిసెట్టి నిఖిల్‌సాయిగా తెలిపారు.

అట్రాసిటీ కేసు నమోదు

సంతకవిటి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పోడలి గ్రామానికి చెందిన ఎస్.చిన్నవాడు అనే వ్యక్తిపై శనివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామని ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు. దీనిపై ఎస్ఐ స్థానిక విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోడలి గ్రామానికి చెందిన ఎస్.చిన్నవాడు దగ్గర గతంలో పొన్నాడ తవుడు అనే వ్యక్తి పని చేసేవాడు. అయితే తనకు రావాల్సిన డబ్బులు ఇవ్వమని అడగగా.. చిన్నవాడు తనను కులం పేరుతో దూషించి, కర్రతో దాడి చేశాడని తవుడు ఆరోపిస్తూ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

వేధింపులపై ఫిర్యాదు

సంతకవిటి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజాం పట్టణానికి చెందిన కౌలు సురేష్ అనే వ్యక్తి తనను వేధిస్తున్నాడని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని స్థానిక ఎస్ఐ ఆర్.గోపాలరావు శనివారం తెలిపారు. బాధితురాలు పోలీసులకు చేసిన ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన భర్తతో కలిసి రాజాం పట్టణంలో నివాసం ఉండేది. అయితే వారి ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్న కౌలు సురేష్ ప్రతిరోజూ ఆమెను వేధిస్తుండేవాడు. దీంతో ఆమె భర్త ఆమెను అనుమానించేవాడు. దీని వల్ల సంవత్సరం కిందట ఆమె తన కన్నవారి ఇంటికి వచ్చి ఉండిపోయింది. సెప్టెంబరు 4వ తేదీన సురేష్ ఆ మహిళ ఉన్న కన్నవారి ఇంటికి వచ్చి, ఎవరూ లేని సమయాన్ని చూసి, ఆమె చేయి పట్టుకుని లాగాడు. పెద్ద మనుషుల వద్ద పంచాయితీ పెట్టినా ఎలాంటి ఫలితం లేకపోవడంతో ఆమె శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

నక్కదాడిలో నలుగురికి గాయాలు

సంతకవిటి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సంతకవిటి నుంచి అక్కరాపల్లి వెళ్తున్న నలుగురు వ్యక్తులపై శనివారం ఓ నక్క దాడి చేసి గాయపరిచింది. అక్కరాపల్లి గ్రామానికి చెందిన ఎం.లక్ష్మి, ఎ.సూరయ్య, వి.లచ్చమ్మ, రేగిడి మండలం బూరాడకు చెందిన బి.చిన్నోడు అనే నలుగురు సంతకవిటి నుంచి అక్కరాపల్లి వెళ్తుండగా.. సంతకవిటి శ్మశానవాటిక వద్ద ఓ నక్క వారిపై దాడిచేసి, గాయపరిచింది. వీరు వెంటనే చికిత్స నిమిత్తం సంతకవిటి పీహెచ్‌సీకి వెళ్లారు. వీరికి వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేశారు.

పెట్రోల్ బంకు తనిఖీ

భోగాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): భోగాపురంలోని పెట్రోల్ బంకును బీపీసీఎల్ సేల్స్ అధికారిణి వెందూరి అన్విత శనివారం పరిశీలించారు. పెట్రోల్ కల్తీ అయిదంటూ శుక్రవారం వచ్చిన వార్తకు ఆమె స్పందించి, బంకును తనిఖీ చేశారు. ఆమె పెట్రోల్‌ను పరిశీలించి, కల్తీ కాలేదని చెప్పడంతో, అక్కడే ఉన్న కొంతమంది వాహన చోదకులు ఆమెతో వాగ్వాదానికి దిగారు. దీనిపై ఆమె మాట్లాడుతూ వాహన చోదకులకు నాణ్యమైన పెట్రోల్ అందించడం తమ బాధ్యత అన్నారు. తనిఖీలు చేసి, నివేదికను జేసీకి నివేదిస్తామని తెలిపారు. తహసీల్దార్ రమణమ్మ, సీఎస్‌డీటీ బీవీ మురళి, ఆర్ఐ ఇమ్రాన్ పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న బీపీసీఎల్ సేల్స్ అధికారిణి అన్విత

అందరి సహకారంతో ముందుకు..

(ఐదో పేజీ తరువాయి)

నడిపిస్తామని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం అందుబాటులో వస్తే దానికి అనుబంధంగా పలు పరిశ్రమలు ఏర్పాటవుతాయన్నారు. ఎగుమతులకు ఎంతో అవకాశం కలుగుతుందన్నారు. జిల్లాలోని సముద్రతీర ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లాలో ఎన్నో అవకాశాలు ఉన్నాయని, వాటిపై దృష్టి పెడతామని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాను ముందుకు తీసుకువెళ్తామన్నారు. అంతకుముందు జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, రెవెన్యూ అసోసియేషన్ నాయకులు, కలెక్టరేట్ ఉద్యోగులు, జిల్లా అధికారులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ భూసేకరణ

(ఐదో పేజీ తరువాయి)

ఏమైనా అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులకు తెలియచేసుకోవచ్చునని తెలిపారు. కాగా కొత్తవలస నుంచి విజయనగరం వరకు కొత్తగా నిర్మాణం చేపట్టే రైల్వే నాలుగో లైన్‌కు సంబంధించి భూములు కోల్పోతున్న రైతులతో ఇంతవరకు ఎటువంటి గ్రామసభలు ఏర్పాటు చేయలేదని భూములు కోల్పోతున్న రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చాలారోజుల కిందట నాలుగో లైన్ కోసం సర్వే చేశారని, ఆ తరువాత ఏగ్రామంలో ఏ సర్వే నెంబరులో ఎంతెంత భూమి పోతుందనే విషయం కూడా తమకు తెలియదని, నోటిఫికేషన్ ఇచ్చే వరకు స్పష్టత లేదని రైతులు చెబుతున్నారు. భూసేకరణ చేసేటప్పుడు సహజంగా గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు తీసుకోవాల్సి ఉంది. ఇంతవరకు ఎటువంటి గ్రామ సభలు ఏర్పాటు చేయలేదంటున్నారు. నష్ట పరిహారం ఎంత ఇస్తారనే విషయం కూడా తెలియజేయలేదని వాపోతున్నారు. భూములు కోల్పోయిన వారికి ప్రత్యామ్నాయంగా భూములను చూపించాలని, అభివృద్ధి చేసుకోవడానికి, నష్టపరిహారానికి నిధులివ్వాలని కోరుతున్నారు.

ఉత్తరాంధ్రకు ఆయువుపట్టు

(ఐదో పేజీ తరువాయి)

చేపడుతామన్నారు. కేంద్రమంత్రి అంతకుముందు ఎయిర్‌పోర్టు మొత్తం పర్యటించి పనుల నాణ్యతను పరిశీలించారు. కొద్దిసేపు సమీక్షించారు. ఆయన వెంట ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామి నాయుడు, కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఆర్డీవో దాట్లకీర్తి, తహసీల్దార్ రమణమ్మ, జీఎంఆర్ ప్రతినిధులు ఉన్నారు.

19న నియామక పత్రాలు

(ఐదో పేజీ తరువాయి)

వారికి అదే ప్రాంగణంలో ఏర్పాటుచేసే కౌంటర్ల ద్వారా పత్రాలు ఇవ్వనున్నారు. అభినందన సభ ముగిసిన తరువాత తిరిగి అవే బస్సుల్లో జిల్లాలకు తీసుకువస్తారు. ఆ తరువాత ఎంపికైన అభ్యర్థులకు పాఠశాలల నిర్వహణ, బోధన, పరిపాలన, ఇతర అంశాలపై జిల్లాల వారీగా పది రోజులపాటు శిక్షణ ఇస్తారు. ఇప్పటివరకూ డీఎస్సీ ద్వారా ఎంపికైన టీచర్లను కౌన్సెలింగ్‌లోనే పాఠశాలలు కేటాయించేసేవారు. ఈ పర్యాయం పది రోజుల శిక్షణ ఇచ్చిన తరువాత పాఠశాలలకు పంపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని విద్యా శాఖ అధికారి ఒకరు తెలిపారు. దసరా సెలవులు తరువాత కొత్త టీచర్లకు పాఠశాలలు కేటాయించనున్నట్టు పేర్కొన్నారు.

క్లాప్‌మిత్రలకు వేతనాలు ఇవ్వలే!

(ఐదో పేజీ తరువాయి)

పదవీ కాలం కొద్ది నెలల్లో ముగియనుంది. పంచాయతీ ఎన్నికలకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఇతర పనులకు, బిల్లుల రూపంలో ఆర్థిక సంఘం నిధులు మళ్లిస్తున్నారు. పారిశుధ్య పనులు చేసే క్లాప్‌మిత్రలకు జీతాలు మాత్రం ఇవ్వడం లేదు. ఆ ప్రభావం పంచాయతీల్లో పారిశుధ్యంపై పడుతోంది. జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరిట ప్రత్యేక పారిశుధ్య వాహనాలు కేటాయించిన వైసీపీ ప్రభుత్వం వాటికి నిధులు కేటాయించలేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన చెత్త ట్రాలీలు, మూడు చక్రాల రిక్షాలు పూర్తిగా పాడయ్యాయి. అయితే వైసీపీ సర్పంచ్‌లు కొత్త వాటిని కొనుగోలు చేసేందుకు ఇష్టపడడం లేదు. ఫలితంగా చాలా గామాల్లో చెత్త సేకరణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలదీ అదే తీరు..

2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. జిల్లాలోని 777 గ్రామ పంచాయతీలకుగాను.. 608 చోట్ల వీటి నిర్మాణాలు పూర్తయ్యాయి. ప్రతి 1000 మంది జనాభాకు ఒకరు చొప్పున గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరు ఇంటింటా చెత్త సేకరించి సంపద కేంద్రాలకు తరలించేవారు. ఈ చెత్తను విడివిడిగా సేకరించి కంపోస్టుగా మార్చి విక్రయించడం ద్వారా పంచాయతీలకు ఆదాయం వచ్చేలా ఆ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ కేంద్రాలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. జగనన్న స్వచ్ఛ సంకల్పంగా పేరు మార్చింది. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ పేరుతో ఇష్టారాజ్యంగా వాహనాలను, రిక్షాలను కొనుగోలు చేసి పంచాయతీలకు అంటగట్టింది. అవసరం లేకున్నా వాటిని పంచాయతీలకు కేటాయించడంతో అవి మూలకు చేరాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ షెడ్ల నిర్మాణానికి రూ.7 లక్షల నుంచి రూ.15 లక్షల వరకూ ఖర్చు చేశారు. పంచాయతీలో జనాభాను అనుసరించి వీటి నిర్మాణం చేపట్టారు. వానపాములు, ఎరువుల తయారీకి ఏర్పాట్లు చేశారు. చెత్త సేకరణకు జనాభా ప్రాతిపదికన క్లాప్ మిత్రలను కేటాయించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేందుకుగాను ప్రతి ఇంటికీ బుట్టలను అందించారు. వీధుల్లో చెత్తను తీసుకురావడానికి మూడు చక్రాల రిక్షాను సమకూర్చారు. కేంద్రాలకు తరలించేందుకు జనాభా ఎక్కువ ఉన్నచోట ఆటోలను ఏర్పాటుచేశారు. తడి, పొడి చెత్తను వేరుచేసే వీలుగా కేంద్రాల్లో నాడెప్‌లను నిర్మించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ముక్కలు చేసేందుకు శానిటరీ నాప్‌కిన్లు, బూడిద చేసేందుకు యంత్రాలను సమకూర్చారు. కానీ వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అవన్నీ మూలకు చేరాయి. లక్ష్యం పూర్తిగా దెబ్బతింది.

ప్రణాళిక ఉన్నా..

కూటమి ప్రభుత్వం గత ఏడాది అక్టోబరు 2 నుంచి సంపద కేంద్రాలను పునరుద్ధరించేందుకు నిర్ణయం తీసుకుంది. ఇళ్లు, వ్యాపార సంస్థలు, వాణిజ్య సముదాయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో చెత్త సేకరించాలన్నది ప్రణాళికలో భాగం. సేకరించిన చెత్తను సంపద తయారీ కేంద్రంలో రీసైక్లింగ్ చేయడానికి నిర్ణయించింది. మరోవైపు తడి చెత్తను ఎరువుల తయారీకి వినియోగించాలని ప్రణాళిక రూపొందించింది. కానీ చాలా పంచాయతీల్లో వైసీపీకి చెందిన సర్పంచ్‌లు మోకాలడ్డుతున్నట్టు తెలుస్తోంది.

జీతాలివ్వాలని ఆదేశాలు ఇచ్చాం

పంచాయతీల్లో ఆర్థిక సంఘం నిధుల నుంచి క్లాప్‌మిత్రలకు జీతాలు ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. కానీ ఇవ్వలేదని ఫిర్యాదులు వస్తున్నాయి. జిల్లాలో చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తెస్తున్నాం. 777 పంచాయతీలకుగాను దాదాపు అన్ని చోట్ల వీటి నిర్మాణం పూర్తయ్యింది. చాలా కేంద్రాల్లో ఇప్పటికే చెత్త సేకరణ జరుగుతోంది. అయితే మిగతా చోట్ల కూడా ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం.

- డీవీ మల్లిఖార్జునరావు, జిల్లా పంచాయతీ అధికారి, విజయనగరం

నాగావళిలోకి 6,500 క్యూసెక్కుల వరద

గరుగుబిల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళి నదిలో వరద ప్రవాహం నిలకడగా కొనసాగుతోంది. శనివారం ఎగువ నుంచి 6,500 క్యూసెక్కులకుపైగా వరద నదిలో చేరింది. దీంతో అధికారులు స్పిల్‌వే నుంచి దిగువకు ఐదు వేల క్యూసెక్కులకు పైగా విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం 105 మీటర్లకు గాను 104.51 మీటర్ల కు చేరింది. సాగునీటి అవసరాలకు ప్రధాన కాలువల నుంచి 1,320 క్యూసెక్కుల విడిచిపెడుతున్నారు. భారీ వర్షాలు కురిస్తే వరద ఉధృతి పెరిగే అవకాశం ఉంది. ఒడిశా ప్రాంతంలో వర్షాలు కురిస్తే వరద వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పూర్తి చేశారు.. ప్రారంభించడం మరిచారు

- శిథిలావస్థకు చేరిన భవనంలోనే విధులు
- ఇదీ రేగిడి తహసీల్దార్ కార్యాలయం పరిస్థితి

రేగిడి, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): రేగిడి తహసీల్దార్ కార్యాలయభవనం పనులు పూర్తిచేసి ఆరేళ్లు కావస్తున్నా ప్రారంభించడాన్ని అధికారులు మరిచిపోయారు. దాదాపు రూ. 90 లక్షల అంచనాతో నిధులు మంజూరు కాగా, కాంట్రాక్టర్‌కు బిల్లుల చెల్లింపు, ఇతర సమస్యలతో సకాలంలో భవనం నిర్మాణం పూర్తికాలేదు. కుటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిచేశారు. ఈభవనాన్ని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో శిథిలావస్థకు చేరిన భవనంలోనే ప్రస్తుతం విధులు నిర్వహించాల్సివస్తోంది. ప్రస్తుతం వర్షం కురిస్తే భవనంలో పలు గదులు కారిపోతున్నాచని, పెచ్చులూడిపోవడంతోపాటు గదులకు చెదలు పట్టాయని సిబ్బంది చెబుతున్నారు. కార్యాలయానికి రెవెన్యూపరమైన సమస్యలపై వచ్చే అర్జీదారులు కూడా శిథిలావస్థకు చేరిన భవనం చూసి భయాందోళనకు గురవుతున్నారు. తక్షణమే రెవెన్యూ అధికారులు స్పందించి కొత్తగా పూర్తయిన భవనం అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



పనులు పూర్తయిన రేగిడి తహసీల్దార్ కార్యాలయం భవనం

ఘనంగా కోడూరు మాత యాత్ర



ప్రార్థనలు చేస్తున్న భక్తులు

బాడంగి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో కోడూరులో వెలసిన కోడూరుమాత యాత్ర ఘనంగా జరిగింది. ప్రతి ఏటా సెప్టెంబరు రెండో శనివారం ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విశాఖ పీఠాధిపతులు ఫాదర్ డాక్టర్ ఉడమల బాలా, కోడూరు మాత చర్చి ఫాదర్ యుగలకుమార్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. సీఐ నారాయణరావు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఎస్‌ఐలు తారకేశ్వరరావు, ఆర్.జయంతి, వెలమల ప్రసాద్‌తోపాటు 70 మందిసిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. విజయనగరంతోపాటు పార్వతీపురం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు కోడూరు మాతను దర్శించుకుని ముడుపులు చెల్లించారు.ఆర్టీసీ, ప్రైవేటు వాహనాలు, ఆటోల కోసం సీఐ నారాయణరావు వన్‌వే ట్రాఫిక్ ఏర్పాటుచేయడానికి చర్యలుతీసుకున్నారు. దీంతో భక్తులు రద్దీ లేకుండా ప్రార్థనామందిరానికి చేరుకొని ప్రార్థనలుచేసుకొని ఎటువంటి అసౌకర్యం లేకుండా వన్‌వే ద్వారా వారి వారి స్వగ్రామాలకు సురక్షితంగా చేరుకున్నారు. ఈ ఏడాది భక్తుల సంఖ్య పెరిగినట్టు చర్చి ఫాదర్లు తెలిపారు.

డీలర్లకు ఈ-పోస్ యంత్రాలు



ఈ-పోస్ యంత్రాన్ని అందజేస్తున్న రెడ్డి సాయికృష్ణ

బొబ్బిలి రూరల్ , సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో శనివారం సీఎస్‌డీటీ రెడ్డిసాయికృష్ణ ఈ-పోస్‌యంత్రాలను నియోజకవర్గంలోని బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం మండలాల్లోని రేషన్ డీలర్లకు 192 ఈ-పోస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఇటీవల ప్రభుత్వం రేషన్ కార్డుల స్థానంలో కొత్తగా స్మార్ట్ కార్డులను అందజేసిన విషయం విదితమే. ఇకపై రేషన్ సరుకులు ఆ కార్డుల ద్వారానే పంపిణీ చేయాలని ఆదేశాల మేరకు కొత్తయంత్రాలుఅందజేశారు. ఆసందర్భంగా రెడ్డి సాయికృష్ణ మాట్లాడుతూ కొత్తయంత్రాలు స్మార్ట్‌రేషన్ కార్డులతో పనిచేస్తాయని చెప్పారు. నెట్‌వర్క్, సిగ్నల్ లేని మారుమూల గ్రామాలు, శివారు ప్రాంతాల్లో సరుకుల పంపిణీ కష్టతరంగా మారడంతో పంపిణీలో జాప్యం తలెత్తి కార్డుదారులు ఇబ్బందిపడేవారని తెలిపారు. ఈ తరహా సమస్యలకు ఇకపై చెక్ పెట్టడంతోపాటు ఎటువంటి లోపాలకు తావులేని విధంగా ఈ-పాస్ మిషన్లు పనిచేస్తాయని చెప్పారు.

19వ వార్డు జనసేన ఇన్‌చార్జిగా సురేష్

బొబ్బిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మునిసిపాలిటీ పరిధిలోని 19 వ వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జిగా కొట్టేడ సురేష్‌ను నియమించినట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గిరడ అప్పలస్వామి నియమించినట్లు ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఏఎంసీ డైరెక్టరు లంక రమేష్ ఒకప్రకటనలో తెలిపారు. బొబ్బిలిలో పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. 19 వ వార్డులో సురేష్ పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేసే విధంగా సహకరిస్తామని రమేష్ తెలిపారు.

లోక్‌అదాలత్‌లో 1451 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి

బొబ్బిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి కోర్టు సముదాయంలో శనివారం మండల న్యాయసేవాకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 1451 కేసులు పరిష్కారమైనట్లు కోర్టు వర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి. బెంచ్-1లో సీనియర్ సివిల్ న్యాయాధికారి బీహెచ్‌వీ లక్ష్మీకుమారి సారధ్యంలో న్యాయవాది సీహెచ్ ఎల్‌వీ ప్రసన్నకుమార్, బెంచ్ -2లో జూనియర్ సివిల్ న్యాయాధికారి హేమస్రవంతి సారథ్యంలో న్యాయవాది ఆర్‌వీఎల్‌బి ప్రసాద్ లోక్‌అదాలత్ నిర్వహించారు. రూ.20.86 లక్షల రూపాయలకు చెందిన నాలుగు సివిల్ కేసులు, టైటిల్ కేసు, ఐపీసీ క్రిమినల్ కేసులు 33, రూ. 9.92 లక్షలకు చెందిన మూడు చెక్ బౌన్స్ కేసులు, రూ. 45.39 లక్షలకు చెందిన ఏడు ఎగ్జిక్యూషన్ పిటిషన్లు, రూ. 7.90 లక్షలతో ఒక మనోవర్తి కేసు రెండు డీవీసీ కేసులు, ఐదు ఎక్సైజ్ కేసులను పరిష్కరించారు.-కోర్టులో 56 పెండింగ్ కేసులు, ఆస్తికి సంబంధించి ఒక ప్రీలిటిగేషన్ కేసు, ఐదు బ్యాంకు బకాయి కేసులు, 88 క్రిమినల్ కేసులు, 1301 ఎస్‌టీసీ కేసులతో కలిపి మొత్తం 1451 కేసులు రాజీ అయినట్లు న్యాయాధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రుంకాన ప్రసాద్, కార్యదర్శి బీఎస్‌ఆర్ మూర్తి, న్యాయవాదులు, పోలీసు పాల్గొన్నారు.

17న రక్తదాన శిబిరం

బొబ్బిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యో తి):బొబ్బిలిలో ఈనెల 17న ప్రధానమంత్రి నరేంద్రమోదీ 75వ జన్మదినం పురస్క రించుకొని మెగారక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లాకార్యదర్శి ముగడ అనిల్‌యాదవ్ తెలిపారు. శని వారం బొబ్బిలిలో ఏర్పాటుచేసిన కార్య క్రమంలో మాట్లాడుతూ రక్తదానశిబిరంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి పావని పాల్గొం టారని చెప్పారు.సమావేశంలో బీజేపీ బొబ్బిలి, రామభద్రపురం, తెర్లాం మండ లాల అధ్యక్షులు తాడి ఈశ్వరరావు, మూ డల్ల ఆదిలక్ష్మి, గొల్లపూడి సాయికుమార్ (మధు), ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త చెలికాని కేశవ పాల్గొన్నారు.

మైనింగ్ తవ్వకాలపై విధానాలు మార్చుకోవాలి

పాలకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో మైనింగ్ తవ్వకాలకు రాష్ట్ర ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని, ఇటువంటి విధానాలను మార్చుకోకపోతే భవిష్యత్తులో ఆందోళనలు చేస్తామని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే నిరంకుశ విధానాలు అవలంబిస్తున్నాయని ఆరోపించారు.శనివారం పాలకొండలో సీఐటీయూ పార్వతీపురంమన్యం జిల్లా 11వ మహాసభలు నిర్వహించారు. తొలుత కోటదుర్గమ్మ గుడి సెంటర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు కార్మికులు ప్రదర్శన చేశారు. అనంతరం కామ్రేడ్ వీజీకేమూర్తి ప్రాంగణంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు అధ్యక్షతన నిర్వహించిన సభలో నరసింగరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల వేతనాలు పెంచకుండా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నాయని ఆరోపించారు.రాష్ట్రంలో మూడు లక్షలకుపైగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్‌చేశారు.సభలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కార్యదర్శులు ఎస్.వై.నాయుడు, బీవీ రమణ, ఇందిర, జిల్లా కోశాధికారి గొర్లె వెంకటరమణ పాల్గొన్నారు.

7,500 పాస్ పుస్తకాలు సిద్ధం

సీతానగరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతానగరం తహసీల్దార్ కార్యాల యంలో ప్రభుత్వం రాజముద్రతో ఏర్పాటు చేసిన రైతుల పాస్ పుస్తకాలు, రైస్‌కా ర్డులు సిద్ధంగా ఉన్నాయని తహసీల్దార్ ప్రసన్నకుమార్ శనివారం తెలిపారు. మం డలంలోని 27 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి 7500 పాస్ పుస్తకాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన వెంటనే ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర చేతులమీదుగా పంపిణీ చేస్తామని తెలిపారు.వీటితో పాటు నూతనంగా వచ్చిన రైస్ కార్డులు కూడా పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని చెప్పారు.

రేపటి నుంచి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృది లక్ష్యాల స్థానికీకరణపై (ఎస్‌డీజీ) సోమవారం నుంచి ఈనెల 18వ తేదీవరకు బొబ్బిలి మండల పరిషత్ సమావేశమందిరంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అల్లు భాస్కరరావు ఒక ప్రకటనలో శనివారం తెలిపారు.15, 16 తేదీల్లో బొబ్బిలి, బాడంగి, రామభద్ర పురం మండలాల మండలాధ్యక్షులు, సర్పంచ్‌లకు, 17, 18వ తేదీల్లో గజపతినగరం, దత్తిరాజేరు మం డలాలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

మాజీ సైనికులు ఐక్యంగా నిలవాలి



మాట్లాడుతున్న అప్పారావు

బొబ్బిలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):మాజీ సైనికులంతా ఐక్యంగా నిలిచి సమస్యలను పరిష్కరించుకోవాలని వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమసంఘం గౌరవాధ్యక్షుడు మరడ అప్పారావు పిలుపునిచ్చారు.శనివారం పాతబొబ్బిలి పెట్రోల్‌బంకులో సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వపరంగా రావాల్సిన అన్ని పథకాలను త్వరితగతిన అమలు చేయాలన్నారు. సంఘానికి భవననిర్మాణం, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు, కుటుంబసభ్యుల సంక్షేమం, భూములు, ఇళ్లస్థలాలు మంజూరుచేయాలని కోరారు. ఎమ్మెల్యే బేబీనాయన ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ఎలాంటి సహకారమైనా అందించేందుకు సిద్ధంగా ఉండడం హర్షనీయమన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు బొమ్మినేని తిరుపతిరావు, చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్.వెంకటనాయుడు, తెంటు సత్యారావు, సబ్బాన సతీష్‌కుమార్, ఆర్‌సీ రావు, కొల్లి జగన్నాథం, పురుషో త్తం, పుల్లయ్య పాల్గొన్నారు.



సమస్యల పరిష్కారానికి కృషి

పార్వతీపురం రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజావేదికలో వచ్చిన ప్రతి వినతిని పరిశీలించి ఆ సమస్య పరిష్కారానికి కృషిచేస్తానని పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ప్రజా వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ప్రజలు పలు సమస్యలపై వినతులు అందించారు. కాగా పార్వతీపురానికి చెందిన మాచర్ల గణపతిరావుకు రూ.63,105 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎమ్మెల్యే విజయచంద్ర తన కార్యాలయంలో అందించారు. కాగా హెచ్.కారాడవలసలో క్వారీ తవ్వకాల అనుమతుల రద్దుపై అధికారుల దృష్టికి తీసుకెళ్లానని, ప్రజల అభిప్రాయం లేకుండా తవ్వకాలు చేయవద్దని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లానని ఎమ్మెల్యే విజయచంద్ర తెలిపారు. తమ గ్రామం పక్కనే ఉన్న ఎలుగులమెట్టపై క్వారీ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని పార్వతీపురం మండలంలోని హెచ్.కారాడవలస గ్రామస్థులు శనివారం బోనెల విజయచంద్రకు వినతిపత్రం అందించారు. క్వారీ ఏర్పాటైతే జరగబోయే నష్టాన్ని ఎమ్మెల్యేకు వివరించారు.

పారిశుధ్య నిర్వహణపై దృష్టి సారించాలి

గరుగుబిల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు సూచించారు. శనివారం మండలంలోని పెదగుడబ, చినగుడబ, రాయిందొరవలస పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనుల నిర్వహణను పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తలను వేరు చేసి సంపద కేంద్రాలకు తరలించాలని,రహదారులు, గృహాలకు ఆనుకుని చెత్త నిల్వలు ఉండరాదని తెలి పారు. తాగునీటి వనరులు కలుషితం కాకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు. బోర్లు, రక్షిత పథకాలు, వీధుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తోటపల్లి కాలువ యూటీకి రంధ్రం

పాలకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాలకొండలోని నగర పంచాయతీలోని వడమలో ఆయకట్టుకు నీరందించే ఎడమ ప్రధాన కాలువ అండర్ టన్నెల్ (యూటీ) ఏలాం జంక్షన్ వద్ద రంధ్రం పడింది. దీనితో పాలకొండ- శ్రీకాకుళం ప్రధాన రహదారి వరదనీరుతో ప్రవ హిస్తుండడంతో వాహన చోదకులు, పాదచారులు ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం ప్రధాన సాగునీటి కాలువ ద్వారా వడమ గ్రామానికి సాగునీరందించే కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి ప్రధానరహదారిపైకి నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని పాలకొండ వాసులుకోరుతున్నారు.

కందివలసలో ఏనుగుల సంచారం

కొమరాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మం డలంలోని కందివలస గ్రామ పరిధిలో ఏను గుల గుంపు సంచరి స్తోంది. మొక్కజొన్న, వరి పంటలను ధ్వంసం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు. ఏనుగు లు సంచరిస్తుండడంతో రాత్రి వేళల్లో రైతులు, పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అటవీశాఖ అధికారులు కోరుతున్నారు.

బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు

సీతానగరం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీతానగరం ప్రొహిబిషన్ పరిధిలోని 145 మంది బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసిన ట్లు ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తెలిపారు. శనివారం సీతానగరంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ బెల్ట్‌షాపు నిర్వాహకుల నుంచి 225 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.నిబంధనలు ధిక్కరించే వారిపై చట్టపర మైన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణ యజమానులు నియ మ నిబంధనలు పాటించాలన్నారు.





